# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళలు కుటుంబానికి, సమాజానికి, దేశానికి పునాది వంటి వారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.**

2. **అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్నిపురస్కరించుకొని నారీశక్తికి వందనం అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.**

3. **మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

4. **గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఎడ్ పరీక్షా పత్రం లీకేజి అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

5. **రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తూ ఆ సంస్థ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది.**

=========================

మహిళలు కుటుంబానికి, సమాజానికి, దేశానికి పునాది వంటి వారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పెర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో "మహిళా శక్తితో వికసిత్ భారత్" అనే అంశంపై ఈరోజు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....

..వాయిస్: 37 సెకన్లు

-------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్నిపురస్కరించుకొని నారీశక్తికి వందనం అంటూ దేశంలోని మహిళలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ఎన్డీయే ప్రభుత్వం మహిళా సాధికారకతకు కృషి చేస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. కాగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లో నిర్వహించిన 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు.

-------------------------

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళల బలాన్ని, శక్తిని సూచిస్తుందని తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.... కాగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ రూపొందించిన శక్తి యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

---------------------------

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నో పథకాలను తీసుకొచ్చారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. చిత్తూరులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మహిళాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లోను సమానంగా రాణిస్తున్నారని చెప్పారు.

---------------------------

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన 2 కే రన్‌ను మంత్రి ప్రారంభించారు.

---------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో "అదృశ్య అవరోధాలను ఛేదించడం– మహిళల నాయకత్వం –సవాళ్లు –పురోగమించే మార్గం" అనే అంశంపై రాష్ట్రస్థాయి ప్యానెల్ డిస్కషన్ ను నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితలతో సహా విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబుతో పాటు వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా హోంశాఖా మంత్రి వి. అనిత మాట్లాడుతూ..... మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, పని ప్రదేశాలలో వారికి రక్షణ కల్పించేందుకు కొత్తగా 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ, మహిళా సాధికారత సామాజిక పురోగతి మాత్రమే కాదని, ఆర్థిక వృద్ధికి కీలకమని పేర్కొంటూ...

...వాయిస్: 23 సెకన్లు....

---------------------------

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఎడ్ పరీక్షా పత్రం లీకేజి అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మానవ వనుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్ తెలిపారు. పరీక్షను రద్దు చెయ్యాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరగాల్సిన ప్రాస్పెక్టివ్స్ ఇన్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ పరీక్ష ప్రశ్నాపత్రం... నిర్ణీత సమయానికి ముందే లీక్ కావడంపై విచారణ చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఇటువంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని... బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని నారా లోకేష్ హెచ్చరించారు.

---------------------------

రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తూ ఆ సంస్థ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 17 నుంచి నెలాఖరు వరకు 6.49 లక్షల మంది విద్యార్థులు 3 వేల 450 పరీక్ష కేంద్రాలకు హాజరవుతారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో చర్చించి, వివిధ మార్గాల్లో విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ప్రజారవాణాశాఖ అధికారులను ఆర్టీసీ యాజమాన్యం ఆదేశించింది.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో మహిళల సంరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినత్సవాన్ని పురస్కరించకుని ఈరోజు విజయవాడలో రెండు వేల మంది విద్యార్థినిలతో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టరు లక్ష్మి శా, నగర పోలీసు కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని వారం రోజులపాటు మహిళా సాధికారతపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలుపుతూ...

..వాయిస్: 20 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పాదకతలో భాగంగా టాటా రెన్యువబుల్ ఎనర్జీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పాల్గొన్నారు. 7వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కోసం టాటా పవర్‌తో ఒప్పందం చేసుకున్నట్టు లోకేష్ తెలిపారు. దీని ద్వారా 7.5లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా పాలనలో ఏఐ, సాంకేతికతను వేగవంతం చేయడమే లక్ష్యంగా వాద్వానీ ఫౌండేషన్ తోనూ రాష్ట్ర ప్రభుత్వం మరో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 21 సెకన్లు....

---------------------------

దేశంలో మూడోవంతు మంది యువత ఉన్నత విద్యకు దూరమవుతున్నారని యూజీసీ ఛైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్ తెలిపారు. దీన్ని నివారించేందుకే డిగ్రీ సబ్జెక్ట్ లతో సంబంధం లేకుండా పీజీ కోర్సుల్లో చేరేలా నిబంధనల్లో మార్పులు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామని ఆయన తెలిపారు. విజయవాడలో ఒక కళాశాల స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఏఐ ఆధారిత కోర్సులు భవిష్యత్‌ను శాసించబోతున్నాయని జగదీశ్ కుమార్ వివరించారు. విద్యారంగంలో సంస్కరణలతోనే దేశ ముఖచిత్రం

మారిపోతుందన్న ఆయన... వేర్వేరు రంగాల్లో స్థిరపడిన ఉన్నత విద్యావంతులు  బోధనా రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు.

---------------------------

గుంటూరు జిల్లా వెంకటపాలెంలో ఈ నెల 15న శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు తెలిపారు. వెంకటపాలెంలోని టీటీడీ ఆలయ ప్రాంగణంలో నిన్న కార్యక్రమ గోడపత్రికను... సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు.

======================